
నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం15 జూన్ 2024 | RANGAREDDY



# మురుగు.. దారులు

## మున్సిపాలిటీల్లో లోపించిన పారిశుద్ధ్యం

- చిన్నపాటి వర్షానికే రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు
- పైపులైన్‌లు లీకై తాగునీటిలో కలుస్తున్న మురుగు
- సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ఆందోళన చెందుతున్న జనం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపాలిటీ అధికారులు
- గ్రూపు రాజకీయాలకే పరిమితమైన పాలకమండళ్లు



వికారాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో ఎక్కడ చూసినా మురుగు నీరే దర్శనమిస్తున్నది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే డ్రైనేజీ నీరు రోడ్లపై పరుగు పెడుతుండడంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. జనం రోడ్లపై నడవలేక, దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లోని పలు కాలనీల్లో వర్షపు నీటితో డ్రైనేజీలు నిండి ఇండ్లలోకి మురుగు వస్తున్నది. నిత్యం మురుగునీరు ప్రవహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి పరిష్కార చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. తడి-పొడి చెత్త సేకరణ మినహా ఇతర పారిశుద్ధ్య పనులను గాలికొదిలేయడంతో మురుగు సమస్య మరింత జఠిలంగా మారుతున్నది. ప్రధాన కూడళ్లలోనూ మురుగు నీరు నిలిచి నడవలేని పరిస్థితి నెలకొన్నది. ముఖ్యంగా వికారాబాద్ మున్సిపాలిటీలోని రామయ్యగూడ వెళ్లే దారిలో డ్రైనేజీ నీరు రోడ్డుపై పరుచుకొని వెళ్తుండడంతో వాహనాదారులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు లీకై తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం, పట్టించుకోవాల్సిన పాలక మండళ్లు సైతం వర్గపోరు, గ్రూపు రాజకీయాలకే పరిమితం కావడంతో మురుగు సమస్య ప్రజల పాలిట శాపంగా మారింది.

### ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు...

వర్షపు నీరు నిల్వ ఉండడం, మురుగు రోడ్లపై పారుతుండడంతో దోమలు, ఈగలు పెద్ద ఎత్తున వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు తాగునీరు కూడా కలుషితమవుతుండడంతో మున్సిపాలిటీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలందరూ రోగాలతో మంచాన పడడం ఖాయమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జనం చలి జ్వారాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టి వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## అక్రమ నిర్మాణాలు,రిసార్టులకు నోటీసులు



తుర్కయాంజాల్, జూన్ 14 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలు, అక్రమ రిసార్టులకు మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సిబ్బంది నోటీసులను జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించి.. వాటికి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. నోటిసులకు సదరు నిర్మాణదారులు స్పందించకపోతే తదుపరి చర్యలు తప్పవన్నారు.

# వెనుకబడి

- అసంపూర్తి పనుల మధ్యే తరగతుల నిర్వహణ
- ఎక్కడి సమస్యలు అక్కడే.. వసతులు లేక అవస్థలు
- తొలివిడుతలో 423 పాఠశాలల్లోనే మొదలైన పనులు
- ఇప్పటివరకు 103 పాఠశాలల్లోనే పనులు పూర్తి
- సమస్యలతో సహవాసం చేస్తున్న విద్యార్థులు

## నత్తనడకన సాగుతున్న 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులు

రంగారెడ్డి, జూన్ 14(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న పలు నిర్మాణ పనులు ఇంకా నత్తనడకనే కొనసాగుతున్నాయి. స్కూళ్లు తెరిచే నాటికి పనులను పూర్తి చేయాల్సి ఉండగా.. కాలేదు. పనులు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కొన్ని స్కూళ్లలో పనుల మధ్యే తరగతులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, కరెంట్ వంటి సౌకర్యాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో తొలి విడుతలో 423 పాఠశాలల్లో పనులను ప్రారంభించగా.. ఇప్పటివరకు 103 పాఠశాలల్లోనే పనులు పూర్తయ్యాయి. బడిబాట కార్యక్రమం పూర్తయ్యేనాటికి పనులు పూర్తి అయిన వాటిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### ఐదు రకాల పనులు ఎంపిక..

మన ఊరు-మన బడి, పీఎం శ్రీ పథకాల కింద ఎంపిక కాకుండా మిగిలిపోయిన ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో మొత్తం 1,309 పాఠశాలలను ఎంపిక చేశారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను గత విద్యాసంవత్సరం చివరలోనే అధికారులు గుర్తించారు. ప్రధానంగా పాఠశాలల్లో ఐదు రకాల సమస్యలు నెలకొన్నట్లు గుర్తించి ఆయా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. భవనాలకు మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సమస్యలతోపాటు బాలికలకు మరుగుదొడ్లు లేని చోట నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేశారు. ఈ క్రమంలో తొలి విడుతలో 423 పాఠశాలల్లో పనులను మొదలు పెట్టారు. వివిధ కారణాలతో ఆలస్యంగా పనులను ప్రారంభించడంతో పాఠశాలలు తెరిచే నాటికి పనులు పూర్తి కాలేదు. ఇప్పటివరకు కేవలం 103 పాఠశాలల్లోనే పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 286 పాఠశాలల్లో పనులను చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు వారు చెబుతున్నారు.

### కానరాని నూతన శోభ..

అమ్మ ఆదర్శ కమిటీలతో చేపడుతున్న ఈ పనులకు డీఎంఎఫ్‌టీ, ఉపాధిహామీ నిధులను వెచ్చిస్తున్నారు. నాణ్యతను పరిశీలించడంతోపాటు చేసిన పనులను రికార్డు చేసి చెల్లింపులకు సిఫారసు చేసే బాధ్యతలను పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీ ఇంజినీరింగ్ ఏఈలకు అప్పగించారు. విద్యాశాఖ అధికారితోపాటు ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీవో, ఎంపీవోలతోపాటు జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారులు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో పాఠశాలలు తెరిచేనాటికి నూతన శోభను సంతరించుకోలేకపోయాయి. పనులు పూర్తయిన చోట ఇంకా రంగులు వేయలేదు. బడి బాట కార్యక్రమం ముగిసేనాటికి అన్ని పనులు పూర్తిచేసుకున్న పాఠశాలల్లో పనులను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక విడుతల వారీగా..పనులను చేపడుతుండడంతో ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చేసరికి ఇంకెంత కాలం పడుతుందో! అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



నవాబుపేట మండలం ఎల్లకొండ జడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న పనులు



శంకర్‌పల్లి : పర్వేద ప్రాథమిక పాఠశాలలో నీటి వసతి దుస్థితి..



శంకర్‌పల్లి మండలంలోని పాఠశాలలో ధ్వంసమైన ఫర్నీచర్



శంకర్‌పల్లి : పాడైన ఫ్యాన్

### జూలై నాటికి పనుల పూర్తికి చర్యలు : సుశీందర్ రావు, డీఈవో, రంగారెడ్డి జిల్లా



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటివరకు యాభై శాతం పనులు పూర్తయ్యాయి. జూలై నాటికి ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో పనులను పూర్తి అయ్యేలా చూస్తాం.

# వారంలో ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్, చిత్రంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక


రంగారెడ్డి, జూన్ 14(నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : వారం వ్యవధిలో 'ధరణి' పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణిలో భూసంబంధిత అంశాలపై దరఖాస్తుదారులు సమర్పించిన అర్జీలపై చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాల పై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్లు అధికారులతో సమీక్షించి మాట్లాడారు. ధరణిలో వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను పరిశీలించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తయిన వాటిని మూడు, నాలుగు రోజుల్లో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా వారం వ్యవధిలో పరిష్కరించాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న ధరణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా భవన్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన అర్జీలను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలపై చేపట్టిన చర్యల గురించి దరఖాస్తుదారుడికి వివరాలు తెలియజేయడంతోపాటు, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఆర్డీవోలు సాయిరాం, అనంత్‌రెడ్డి, సూరజ్ కుమార్, వెంకట్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి , అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# వర్షాకాల ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తాం

- నీరు నిలిచే 125 హాట్‌స్పాట్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం
- 16 ఎమర్జెన్సీ బృందాలు, 24 గంటల పాటు పనిచేస్తాయి
- కలుషిత నీటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం
- వర్షాకాల ప్రణాళిక అమలుపై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి



సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ ): వర్షాకాలంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, పర్యవేక్షించేందుకు జలమండలి కమాండ్ కంట్రోల్ రూం 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రత్యేకంగా నీరు నిలిచే 125 హాట్‌స్పాట్స్ గుర్తించామని, ఇందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేస్తారని ఎండీ చెప్పారు. వర్షాకాల ప్రణాళిక, అమలుపై శుక్రవారం ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. మూడు షిఫ్టులు, 24 గంటలు క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయని, జీహెచ్ఎంసీ కోర్ సిటీతో పాటు శివార్లలోనూ బృందాలు పర్యటిస్తాయని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల సమన్వయానికి ముగ్గురు అధికారులను నియమించామని చెప్పారు. రహదారులపై ఉన్న మ్యాన్‌హోల్స్, డీప్ మ్యాన్‌హోల్స్‌ను సులభంగా గుర్తించే విధంగా వాటికి ఎరుపు రంగు వేశామన్నారు. డీప్ మ్యాన్‌హోల్ ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. మేనేజర్ మొదలుకొని జనరల్ మేనేజర్ వరకు అధికారులు, వాటర్ లాగింగ్ పాయింట్లను రోజూ సందర్శిస్తారని తెలిపారు. వర్షాకాలంలో జలమండలి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (ఈఆర్టీ) బృందాలను రంగంలోకి దింపామని, 16 ఎమర్జెన్సీ బృందాల్లో ఒక్కో బృందంలో ఐదుగురు ఉంటారని వివరించారు. కలుషిత నీటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని, రోజూ శాంపిల్స్ సేకరణతో పాటు క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేస్తామన్నారు. ఏఎంఆర్ మీటర్ల నిర్వహణలో లోపాలు గుర్తించామని, సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



పెద్దేముల్‌లో..





మంచాల పాఠశాలలో..

## అక్షరాభ్యాసం..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాలు దిద్దించారు.